క్లుప్తంగా

నేడు ఉపాధ్యాయులకు అవగాహన సదస్సు

ఉదయగిరి: పట్టణంలోని షాదీమంజిల్‌లో 'తరగతి గదిని ఆకర్షణీయంగా ఉంచడం ఎలా?' అనే అంశంపై ఉపాధ్యాయులకు ఆదివారం ఒక్క రోజు అవగాహన సదస్సును నిర్వహిస్తున్నట్లు జేవీవీ నాయకులు దస్తగిరి అహ్మద్, జీ రామిరెడ్డి శనివారం తెలిపారు. జేవీవీ నేతలు బ్రహ్మారెడ్డి, సుధాకర్‌రెడ్డి ముఖ్య వక్తలుగా హాజరవుతారని చెప్పారు. సీతారామపురం, ఉదయగిరి, వరికుంటపాడు, దుత్తలూరు మండలాల ఉపాధ్యాయులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

రేపట్నుంచి జీర్ణోద్ధరణ ఉత్సవాలు

ఆత్మకూరురూరల్: మహిమలూరులోని పడమటి వీధిలోని కోదండరామస్వామి ఆలయంలో జీర్ణోద్ధరణ ఉత్సవాలను సోమవారం నుంచి ఐదు రోజుల పాటు శాస్త్రోక్తంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శనివారం తెలిపారు. కాకినాడ జిల్లా పెద్దాపురానికి చెందిన వేదపండితులు వాకాణి వెంకటమారుతి కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు.

నేడు పది, ఇంటర్ విద్యార్థులకు ప్రేరణ

ఆత్మకూరు: సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లోని పదోతరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు ప్రేరణ తరగతులను ఆదివారం నిర్వహించనున్నట్లు ఆత్మకూరు సాంఘిక సంక్షేమ శాఖ సహాయ అధికారి కే బ్రహ్మానందరెడ్డి, శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని ఆంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలో ఉదయం 10 గంటలకు జరిగే కార్యక్రమానికి జిల్లా షెడ్యూల్ కులాల సంక్షేమ, సాధికారత అధికారిణి కే శోభారాణి, ఆత్మకూరు ఆర్డీఓ బీ పావని ముఖ్యఅతిథులుగా హాజరవుతారని చెప్పారు.

మంత్రులు వస్తున్నారని...

- దుత్తలూరు రోడ్డు గుంతలు తాత్కాలికంగా పూడ్చివేత



దుత్తలూరు: దుత్తలూరు సెంటర్ నుంచి దుత్త గ్రామానికి వెళ్లే రోడ్డు గుంతలకు అధికారులు తాత్కాలికంగా శనివారం మరమ్మతులు చేపట్టారు. నర్రవాడలోని శ్రీదేవి, భూదేవి సమేత జనార్దనస్వామి ఆలయంలో జరుగుతున్న జీర్ణోద్ధరణ, మహాసంప్రోక్షణ ఉత్సవాలకు మంత్రులు నారాయణ, ఆనం రామనారాయణరెడ్డి, తదితరులు హాజరవుతారనే సమాచారంతో అధికారులు హడావుడిగా చెరువుకట్టపై రోడ్డు గుంతలను కంకర, చిప్సపొడితో పూడ్చారు.

బీజేపీ మండలాధ్యక్షుడిగా వెంగళరెడ్డి



దుత్తలూరు: బీజేపీ మండలాధ్యక్షుడిగా లెక్కల వెంగళరెడ్డి ఎన్నికయ్యాడు. దుత్తలూరులో పార్టీ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు పులిచర్ల నారాయణరెడ్డి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన సంస్థాగత ఎన్నికల్లో బండకిందపల్లికి చెందిన వెంగళరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పార్టీ నాయకులు చుండి హరిగోపాల్‌రెడ్డి, మేకపాటి మాల్యాద్రి, పెసల కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక డంపింగ్ యార్డు పరిశీలన



సంగం: సంగంలోని ఇసుక డంపింగ్ యార్డును ఆత్మకూరు ఆర్డీఓ పావని శనివారం పరిశీలించారు. ఇసుక నిల్వలను పరిశీలించి స్టాక్ రికార్డులను తనిఖీ చేశారు. రికార్డులను పక్కాగా నిర్వహించాలని సూచించారు. పెన్నా నదిలోని ఇసుకను ట్రాక్టర్ల ద్వారానే ఇసుక డంపింగ్ యార్డుకు తరలించాలన్నారు. అనంతరం రహదారిపై ఇసుక లారీలను ఆపి రసీదులను తనిఖీ చేశారు. ఆర్డీఓ వెంట తహసీల్దార్ సోమ్లానాయక్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

చిరుత కలకలం

మర్రిపాడు: మర్రిపాడు సమీపంలోని అటవీ ప్రాంతంలో నెల్లూరు – ముంబై జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి చిరుత సంచరంపై కలకలం రేగింది. రోడ్డు దాటుతూ చిరుత కనిపించిందని అటుగా వెళ్తున్న వాహనదారులు తెలిపారు. రోడ్డుపైనే వాహనాన్ని నిలిపేశామని, అనంతరం అది అడవిలోకి వెళ్లిపోయిందని వివరించారు. దీనిపై ఆత్మకూరు రేంజర్ శేఖర్‌ను సంప్రదించగా, మండల పరిధిలోని వెలిగొండ అటవీ ప్రాంతంలో 14 చిరుతలున్నాయని చెప్పారు. రోడ్డుపైకి వచ్చిన సమయంలో ప్రజలు గమనించి ఉంటారని, అవసరమైన రక్షణ చర్యలను చేపట్టనున్నామని తెలిపారు.

పేద విద్యార్థులపై సర్కార్ పగ

పట్టణంలోని ఆంధ్రకేసరి మున్సిపల్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో చదువుతున్న పేద, మధ్యతరగతి విద్యార్థులపై రాష్ట్ర ప్రభుత్వం పగబట్టింది. పాఠశాలను అప్‌గ్రేడ్ చేయడం ద్వారా విద్యార్థుల ప్రగతికి బాటలు వేయాల్సిన ప్రభుత్వం అందుకు భిన్నంగా వ్యవహరిస్తోంది. కార్పొరేట్ విద్యాసంస్థలకు కొమ్ముకాస్తూ సంస్కరణల పేరుతో పాఠశాలను డీగ్రేడ్ చేసేందుకు యత్నిస్తోంది. తద్వారా పేద,మధ్యతరగతి విద్యార్థులను విద్యకు దూరం చేసేందుకు కుట్ర పన్నుతోంది.

- ఆంధ్రకేసరి స్కూల్‌లో 450 మందికిపైగా విద్యార్థులు
- ప్రభుత్వ సంస్కరణల పేరుతో డీగ్రేడ్‌కు అధికారుల ప్రతిపాదనలు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు
- హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేయాలని డిమాండ్



ఆంధ్రకేసరి మున్సిపల్ ఇంగ్లిష్ మీడియం స్కూల్

కావలి: పట్టణంలోని జనతాపేటలో ఉన్న ఆంధ్రకేసరి మున్సిపల్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌కు ఎంతో చరిత్ర ఉంది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత 1954లో కావలిలో ప్రభుత్వం ఏర్పాటు చేసి మొట్టమొదటి పాఠశాల ఇది. ప్రస్తుతం పాఠశాలలో 1వ తరగతి నుంచి 8వ తరగతి వరకు విద్యాబోధన చేస్తున్నారు. మొత్తం 450 మందికి పైగా విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. అందులో పేద, మధ్యతరగతి విద్యార్థులే అధికంగా ఉన్నారు. స్కూల్‌ను అప్‌గ్రేడ్ చేసి విద్యార్థుల భవితకు బాటలు వేయాల్సిన ప్రభుత్వం అందుకుభిన్నంగా డీగ్రేడ్ చేసేందుకు చర్యలు తీసుకుంటుండడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

కార్పొరేట్ స్థాయిలో వసతులు

ఆంధ్రకేసరి మున్సిపల్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ లో కార్పొరేట్ స్థాయిలో వసతులు ఉన్నాయి. తరగతి గదులు, ఆవరణం పరిశుభ్రంగాఉంటాయి. స్కూల్‌లో సీసీకెమెరాలు ఉన్నాయి. రూ.5.5 లక్షల తో నిర్మించిన అధునాతన మినరల్ వాటర్ ప్లాంట్ ఉంది. ఉపాధ్యాయులు అంకితభావంతో బోధన చేపడుతుండడం..పూర్తిగా ఇంగ్లిష్ మీడి యం పాఠశాల కావడంతో పట్టణంలోని సుదూర ప్రాంతాలకు చెందిన పేద విద్యార్థులు ఇక్కడికి వస్తుంటారు. ఏటా స్కూల్ ప్రారంభంలోఅడ్మిషన్లు సైతం వెంటనే పూర్తవుతాయి. ఆ తర్వాత సీట్లు లేవని అడ్మిషన్లు నిలిపివేసే పరిస్థితి కూడా ఉంటోంది.

పీఎంశ్రీకి సైతం ఎంపిక

కేంద్ర ప్రభుత్వం కొన్ని ప్రమాణాలను ఎంపిక చేసుకుని వాటిని అమలు చేస్తున్న ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి 'పీఎంశ్రీ' పథకం కింద నిధులు మంజూరు చేస్తుంది. ఆంధ్రకేసరి మున్సిపల్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో కేంద్రం ప్రభుత్వం నిర్దేశించిన అన్ని రకాల ప్రమాణాలు ఉండడంతో పీఎంశ్రీ పథకానికి అధికారులు ఎంపిక చేశారు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం పాఠశాలకు క్రీడా మైదానం అభివృద్ధికి రూ.5లక్షలు మంజూరు చేసింది. ఇంకా రానున్న రోజుల్లో పీఎంశ్రీ పథకం కింద కేంద్ర ప్రభుత్వం నుంచి పాఠశాలకు మరిన్ని నిధులు మంజూరు కానున్నాయి. పాఠశాలను డీగ్రేడ్ చేస్తే పీఎంశ్రీ నిధుల మంజూరు ఆగిపోయే అవకాశం ఉంది.

విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళన

ఆంధ్రకేసరి మున్సిపల్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో 450 మందికిపైగా విద్యార్థులు ఉన్నారు. గత కొంతకాలంగా విద్యార్థుల తల్లిదండ్రులు హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేసి 9,10 తరగతులను నిర్వహించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. అయితే తాజాగా ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణల పేరుతో అధికారులు స్కూల్‌ను డీగ్రేడ్ చేయాలని చూస్తున్నారు. 6,7,8 తరగతులను తొలగించి పట్టణంలోని మున్సిపల్ ఉన్నత పాఠశాలలకు తరలించాలని ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ప్రభుత్వ జీఓ నంబర్ 117 ప్రకారం 6,7,8 తరగతుల్లో 60 మందిలోపు విద్యార్థులు ఉంటేనే డీగ్రేడ్ చేసి సమీపంలోని ఉన్నత పాఠశాలలకు తరలించాల్సి ఉంది. ఆంధ్ర కేసరి పాఠశాలలో 6,7,8 తరగతుల్లో 175 మంది విద్యార్థులు ఉన్నారు. స్కూల్‌ను అప్‌గ్రేడ్ చేయాల్సిన అధికారులు అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారు. సుమారు మూడు కిలో మీటర్ల దూరంలో ఉన్న మరో హైస్కూల్‌కు తరలించాలని నిర్ణయించడంపై తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. 6,7,8 తరగతులను తొలగించే ఆలోచనను మానుకుని హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేయాలని కోరుతూ విద్యార్థులతో కలిసి స్కూల్ వద్ద శుక్రవారం ఆందోళన చేపట్టారు. అనంతరం కావలి ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి ఆర్డీఓకు వినతిపత్రం సైతం అందజేశారు.

హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేయాలి

ఆంధ్రకేసరి పాఠశాలకు సుదీర్ఘ చరిత్ర ఉంది. స్కూల్‌లో 6,7,8 తరగతుల్లో 175 మందికిపైగా విద్యార్థులు ఉన్నారు. పేద, మధ్యతరగతి విద్యార్థులే ఎక్కువ. పాఠశాలను అప్‌గ్రేడ్ చేయాల్సింది పోయి డీగ్రేడ్ చేయడం తగదు. ప్రభుత్వం తెచ్చిన జీఓ ప్రకారం 60 మందిలోపు ఉంటేనే డీగ్రేడ్ చేయాలి. అలాకాకుండా అధికారులు అనాలోచితంగా డీగ్రేడ్ చేస్తే పేద, మధ్యతరగతి విద్యార్థులు చదువుకు దూరమవుతారు.

– వెంకటకృష్ణ, చైర్మన్ తల్లిదండ్రుల కమిటీ



శుక్రవారం ఆర్డీఓ కార్యాలయం ఎదుట నిరసన తెలిపిన తల్లిదండ్రులు

ఉత్తమ మహిళా కండక్టర్‌గా ధనమ్మ



కావలి: కావలి ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఏ ధనమ్మ ఉత్తమ మహిళా కండక్టర్‌గా ఎంపికయ్యారు. ఈ మేరకు ఆమెకు కావలి ఆర్టీసీ డిపో మేనేజర్ శనివారం ఉత్తమ మహిళా కండక్టర్‌గా ప్రశంసాపత్రాన్ని అందజేసి అభినందించారు. తన కుటుంబసభ్యులు, ఆర్టీసీ అధికారులు, సహచర ఉద్యోగుల సహకారంతో కండక్టర్‌గా సేవలు అందించగలుగుతున్నానని ఆమె తెలిపారు.

అష్టబంధన కుంభాభిషేక మహోత్సవాలు ప్రారంభం

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మండలం నల్లగొండ్లలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో అష్ట బంధన కుంభాభిషేక మహోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. నూతన ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న క్రమంలో మూడ్రోజుల పాటు ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చే అవకాశం ఉండడంతో అందుకనుగుణంగా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

అపస్ టాలెంట్ టెస్ట్ నేడు

వింజమూరు(ఉదయగిరి): స్థానిక వైఆర్ జూనియర్ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ ఉదయగిరి నియోజకవర్గ స్థాయిలో టాలెంట్ టెస్టును ఆదివారం నిర్వహించనున్నట్లు అపస్ సంస్థ ప్రతినిధులు పీ వెంగళరెడ్డి, కందుల మధు శనివారం తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లోని పదో తరగతి విద్యార్థులు మాత్రమే టాలెంట్ టెస్టు రాసేందుకు అర్హులని చెప్పారు. ప్రతిభకనబర్చిన విద్యార్థులకు డీఆర్డీఓ మాజీ చైర్మన్ జీ సతీష్‌రెడ్డి చేతుల మీదుగా బహుమతులను అందజేయనున్నట్లు తెలిపారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం



మాట్లాడుతున్న ఆర్డీఓ వంశీ కృష్ణ

కావలి: పుస్తక పఠనంతో విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని కావలి ఆర్డీఓ ఎం సన్నీవంశీకృష్ణ పేర్కొన్నారు. పట్టణంలోని రామమూర్తిపేటలోని షిర్డీ సాయి మందిరం వెనుకన కలయిక విజ్ఞాన కేంద్రాన్ని శనివారం ప్రారంభించారు. కావలి ఆర్డీఓ ఎం సన్నీ వంశీకృష్ణ, హైదరాబాద్‌కు చెందినవిజ్ఞానదర్శిని వ్యవస్థాపకులు టీ రమేష్, కావలి జవహర్ భారతి కళాశాలకు చెందిన విశ్రాంత అధ్యాపకులు డాక్టర్ జేకృష్ణప్రసాద్, తదితరులు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. కలయిక విజ్ఞాన కేంద్రంలోని గ్రంథాలయం-అధ్యయన కేంద్రంలోని పుస్తకాలను పరిశీలించారు. మహాపురుషుల జీవిత చరిత్రలు, సామాజిక చైతన్యం, విజ్ఞానాన్ని అందించే పుస్తకాలను ఉంచడంపై హర్షాన్ని వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ వయసుతో పరిమితం కాక పుస్తకాలను చదవడం మళ్లీ ప్రారంభించి విజ్ఞానాన్ని, మనోవికాసాన్ని పెంపొందించుకుంటే ఉల్లాసభరిత భారతదేశంగా మనదేశం పునర్వికాసం పొందగలదన్నారు. కలయిక విజ్ఞానకేంద్ర కన్వీనర్ ఇలీంద్ర లావణ్య మాట్లాడుతూ పోటీ పరీక్షలకు హాజరయ్యే యువతకు కలయిక విజ్ఞానకేంద్రం ఉపకరించేలా చూస్తామన్నారు. విజ్ఞానకేంద్రం ఆధ్వర్యంలో బహుళవిధ ప్రాయోజిత కార్యక్రమాలను రూపొందించి ప్రణాళికాబద్ధంగా అమలు చేస్తామన్నారు . కన్వీనర్ జీ రాంప్రసాద్, ఉమా శర్మ, రామచంద్రయ్య, శ్యామల, లక్ష్మిరెడ్డి, హరినారపరెడ్డి , సాయిరాం ప్రసాద్, జాఫర్‌ఖాన్, సలీంమొగల్ , చన్నా వెంకటరామయ్య , షేక్ బుష్రా , ఫాతిమా, సీ శారద, పార్వతీశంకర్, హరనాథ్, రమణయ్య, కొల్లా మాధవరావు , ఓరుగంటి వెంకటేశ్వర్లు , జానకిరామ్ తదితరులు పాల్గొన్నారు.

గండిపాళెం జలాశయం జలాల విడుదల



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కాకర్ల

ఉదయగిరి: మండలంలోని గండిపాళెం జలాశయం నుంచి కాలువలకు సాగునీటిని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గండిపాళెం జలాశయం పరిధిలోని కాలువల్లో పూడికతీత పనులను పూర్తి చేసి సాగునీరు విడుదల చేశామని తెలిపారు. ప్రాజెక్టులో 21 అడుగులు మాత్రమే నీరు ఉన్నందున నాలుగు వేల ఎకరాల్లో పైర్లు సాగు చేసే అవకాశం ఉందన్నారు. ప్రాజెక్టు సమగ్ర అభివృద్ధికి కృషి చేయడంతో పాటు పీ వెంచురామయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం గండిపాళెంలో సీసీరోడ్లు, మినీ గోకులాన్ని ప్రారంభించారు. మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, పీ చెంచల బాబు, చంద్రా మధు, బయ్యన్న, ప్రాజెక్టు చైర్మన్ వెంకటసుబ్బయ్య, ఇరిగేషన్ ఈఈ వెంకటేశ్వర్లు, డీఈ చంద్రమౌళి పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



వింజమూరు(ఉదయగిరి): ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ అధ్వర్యంలో ఈ నెల 7న హైదరాబాద్‌లో నిర్వహించనున్న 'లక్ష డప్పులు-వేల గొంతులు' సభను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు పిలుపునిచ్చారు. ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్లను వింజమూరులోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఇచ్చిన ఎస్సీ వర్గీకరణ బిల్లును అమలు చేస్తామని హామీ ఇచ్చి మాట తప్పిన రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మార్పీఎస్ నాయకులు అంబేడ్కర్, గొల్లపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పౌర హక్కులపై అవగాహన



మాట్లాడుతున్న శేషం సుదర్శన్

సోమశిల: పౌర హక్కులపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మాజీ సభ్యుడు శేషం సుదర్శన్ అన్నారు. అనంతసాగరంలోని గిరిజన కాలనీలో తహసీల్దార్ సుభాషిణి అధ్యక్షతన పౌర హక్కుల దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. శేషం సుదర్శన్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పౌరులకు హక్కులపై అవగాహన కల్పించడం ద్వారా సమాజంలోని అసమానతలు, అంటరానితనం, అస్పృశ్యత, తదితరాలను పూర్తిగా నిర్మూలించడమే పౌరహక్కుల దినోత్సవం ముఖ్యఉద్దేశమని తెలిపారు. గిరిజనులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. ఎంఈఓ-2 కాటంరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, సర్పంచ్ కమతం శోభ, వీఆర్వో రాజేశ్వరి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

35 గ్యాస్ సిలిండర్ల స్వాధీనం

కావలి: పట్టణంలోని పాతూరు ప్రాంతంలో అనధికారికంగా నిల్వ చేసిన 35 గ్యాస్ సిలిండర్లను జిల్లా విజిలెన్స్ సీఐ నరసింహారావు శనివారం స్వాధీనం చేసుకున్నారు. గ్యాస్ సిలిండర్లు నిల్వ చేసిన వాకా వీరారెడ్డి అనే వ్యక్తిపై 6ఏ కేసు నమోదు చేసినట్లు ఆయన చెప్పారు. స్వాధీనం చేసుకున్న సిలిండర్లను పట్టణంలోని జెమ్స్ గ్యాస్ ఏజెన్సీకి అప్పగించినట్లు తెలిపారు.

పింఛన్ల పంపిణీ పరిశీలన

సంగం/అనుమసముద్రంపేట: సంగం పంచాయతీ పరిధిలోని కంద్రిక, ఏఎస్‌పేట మండలం హసనాపురంలో పింఛన్ల పంపిణీ ప్రక్రియను డీఆర్డీఏ పీడీ నాగరాజకుమారి శనివారం పరిశీలించారు. పింఛన్ల పంపిణీ తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. కంద్రికలో సంగం ఎంపీడీఓ షాలెట్‌తో కలిసి పింఛన్లు పంపిణీ చేశారు.

బ్యారికేడ్ల బహూకరణ



దాతను సత్కరిస్తున్న సీఐ, ఎస్సైలు

మర్రిపాడు: మర్రిపాడుకు చెందిన ఐరన్ వ్యాపారి సోమల నాగిరెడ్డి రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా పోలీసులకు బ్యారికేడ్లను శనివారం బహూకరించారు. ఈ సందర్భంగా నాగిరెడ్డిని ఆత్మకూరు సీఐ గంగాధర్, ఎస్సై శ్రీనివాసరావు శాలువాతో సత్కరించి అభినందించారు. రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా మర్రిపాడులో జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు సోమల నాగిరెడ్డి తన సొంత నిధులతో బ్యారికేడ్లను తయారుచేసి బహూకరించడం అభినందనీయమని కొనియాడారు.

సీసీకెమెరాలతో నేరాల కట్టడి

చేజర్ల: సీసీకెమెరాలతో నేరాలను కట్టడి చేయవచ్చని ఎస్సై తిరుమలరావు తెలిపారు. మండలంలోని ఆదురుపల్లి కూడలిలోని వ్యాపారులకు సీసీకెమెరాలపై ఎస్సై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాపారులు తమ దుకాణాల్లో సీసీకెమెరాలను ఏర్పాటు చేసుకోవడం ద్వారా దొంగతనాలను అరికట్టవచ్చని తెలిపారు. అనుమానాస్పద వ్యక్తులను గుర్తించవచ్చన్నారు. వ్యాపారులందరూ సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకుని నేరాల కట్టడికి సహకరించాలని కోరారు.

కుష్టు, ఎయిడ్స్‌పై అవగాహన



సోమశిల: సోమశిలలోని ఏపీ గిరిజన బాలికల రెసిడెన్షియల్ స్కూల్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు జిల్లా పారామెడికల్ అధికారి ఎం మోహన్‌రావు ఆధ్వర్యంలో కుష్టు, ఎయిడ్స్ వ్యాధులపై శనివారం అవగాహన కల్పించారు. అనంతసాగరం పీహెచ్‌సీ లెప్రసీ నోడల్ పర్సన్ టీవీఆర్వీ ప్రసాద్, హెల్త్ అసిస్టెంట్ అబ్దుల్‌ఖాదర్, ఎంఎల్‌హెచ్‌పీ అనూష, ఏపీటీడబ్ల్యూఆర్ఎస్ ప్రిన్సిపల్, ఉన్నత పాఠశాల హెచ్‌ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫైబర్‌నెట్ పరికరాల పంపిణీ

సీతారామపురం : మండలంలోని 40 పాఠశాలలకు జియో ఫైబర్ నెట్‌పరికరాలను ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు ఎంఈఓ మస్తాన్‌వలి శనివారం అందజేశారు. అలాగే టాయిలెట్ క్లీనింగ్ కెమికల్స్, ఎయిర్ ఫ్రెషనర్లను పంపిణీ చేశారు.

విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటం



ఫీజుపోరు వాల్‌పోస్టర్లను ఆవిష్కరించిన ప్రతాప్‌కుమార్‌రెడ్డి

- మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి మల్లికార్జునరెడ్డి
- ఫీజుపోరు వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

కావలి: పేద విద్యార్థులకు ఫీజురీయింబర్స్‌మెంట్ అందించకుండా వారి జీవితాలతో కూటమి ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన కావలిలోని తన నివాసంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఎన్నికలకు ముందు అధికార దాహంతో చంద్రబాబునాయుడు ఇష్టమొచ్చినట్లుగా హామీలు ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చాక హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారని ధ్వజమెత్తారు. అమ్మకు వందనం, ఫీజురీయింబర్స్‌మెంట్ పథకాలను అమలు చేయకుండా పేద విద్యార్థులను సైతం వేధిస్తున్నారన్నారు. పేద విద్యార్థులకు ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకుండా రాక్షసత్వాన్ని ప్రదర్శిస్తున్న కూటమి ప్రభుత్వం కళ్లు తెరిపించేందుకు వైఎస్సార్‌సీపీ ఈ నెల 5న ఫీజుపోరుకు పిలుపునిచ్చిందని తెలిపారు. నెల్లూరులో జరిగే ఫీజుపోరు కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఫీజుపోరుకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు.

కూటమి ప్రభుత్వానిది ప్రచార ఆర్భాటమే

కావలి నియోజకవర్గంలో తాము అధికారంలో ఉన్నప్పుడు మంజూరు చేసిన అభివృద్ధి పనులు మినహా, కూటమి ప్రభుత్వం వచ్చాక కొత్తగా ఒక్క పని కూడా మంజూరు కాలేదని రామిరెడ్డి తెలిపారు. తుమ్మలపెంట రోడ్డు అభివృద్ధికి తాము నిధులు మంజూరు చేయగా, ఇప్పుడు పనులు మొదలు పెట్టారని చెప్పారు. కావలి-సీతారామపురం జాతీయ రహదారి అభివృద్ధి పనులను తమ హయాంలో మొదలు పెట్టగా, ప్రస్తుతం ఉదయగిరి బ్రిడ్జిపై మరమ్మతు పనులు చేపడుతున్నారని తెలిపారు. వైఎస్ జగన్ ప్రభుత్వం ట్రంక్ రోడ్డు విస్తరణకు రూ.55 కోట్లు మంజూరు చేయగా తాము పనులు ప్రారంభించామని తెలిపారు. ఈ పనులను పూర్తి చేసి మాగుంట పార్వతమ్మ పేరును పెట్టాలని తాము నిర్ణయించామన్నారు. ప్రస్తుతం ట్రంకురోడ్డుకు మాగుంట పార్వతమ్మ పేరును పెట్టడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. ట్రంక్‌రోడ్డు విస్తరణ పనులను ఎప్పటిలోగా పూర్తి చేస్తారో ఎమ్మెల్యే కృష్ణారెడ్డి చెప్పాలన్నారు. ప్రజలు అన్ని విషయాలను గమనిస్తున్నారని, సమయం వచ్చినప్పుడు రాజు ఎవరో, మంత్రి ఎవరో చెబుతారన్నారు. ఈ సమావేశంలో నాయకులు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, కనమర్లపూడి వెంకట నారాయణ, సన్నిబోయిన ప్రసాద్ యాదవ్, గంధం ప్రసన్నాంజనేయులు, నెల్లూరు వెంకటేశ్వరరెడ్డి, జంపాని రాఘవులు, వాయిల తిరుపతి , తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా హోమ పూజలు



దుత్తలూరు: మండలంలోని నర్రవాడలోని శ్రీదేవి,భూదేవి సమేత జనార్దనస్వామి ఆలయంలో జీర్ణోద్ధరణ, మహాసంప్రోక్షణ ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. మూడోరోజు శనివారం విశేష పూజలు, హోమాలను నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు చినజీయర్‌స్వామి ఆగమనం

జీర్ణోద్ధరణ ఉత్సవాలకు త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్‌స్వామి రానున్నారు. అలాగే మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, పొంగూరు నారాయణ, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే కాకర్ల సురేష్, తదితరులు హాజరుకానున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

పాఠశాలల విలీన ప్రక్రియను రద్దు చేయాలి



ఎంఈఓ చలపతికి వినతి పత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

ఆత్మకూరు: రాష్ట్ర ప్రభుత్వం జీఓ నంబరు 117 పేరుతో చేపడుతున్న ప్రభుత్వ పాఠశాలల విలీన ప్రక్రియను వెంటనే రద్దు చేయాలని యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆత్మకూరు ఎంఈఓ చలపతికి శనివారం వినతిపత్రం అందజేశారు. పాఠశాలల విలీనంతో కొన్ని ప్రాంతాల్లో పేదపిల్లలు విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉందన్నారు. సుదూర ప్రాంతాల్లోని పాఠశాలలకు వెళ్లలేక విద్యార్థులు డ్రాపౌట్స్‌గా మారుతారన్నారు. ఉర్దూ మీడియం పాఠశాలలను విలీనం చేయడం వల్ల ఉర్దూ భాషకు విద్యార్థులు దూరమవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి గంగాధర్, శివప్రసాదరావు, మండలాధ్యక్షుడు మోహన్‌రావు, ఎండీ రియాజ్, మురళీకృష్ణ, రంతుజానీ, పీఎస్ మస్తాన్, కాలేషా, తదితరులు పాల్గొన్నారు.